టీబీసీ మరమ్మతులు గాలికి..

- ముళ్ల కంపలతో నిండిన తాడిపత్రి బ్రాంచ్ కెనాల్
- చివరి ఆయకట్టు వరకూ నీటి ప్రవాహం హుళక్కే..
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి బ్రాంచి కెనాల్(టీబీసీ) ఆధునికీకరణ గురించి పట్టించుకునే నాథుడే లేడు. అధికారుల నిర్లక్ష్యంతో తాడిపత్రి బ్రాంచి కెనాల్ మరమ్మతులకు నోచుకోవడంలేదు. టీబీసీ కింద 13 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా తాడిపత్రి, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాలి. పుట్లూరు మండలంలోని పుట్లూరు, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల చెరువులు, యల్లనూరు మండలంలోని బొప్పేపల్లి చెరువుకు నీటిని అందించాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో టీబీసీ కాలువ అధ్వానంగా తయారైంది. కాలువకు ఇరువైపులా అతికించి ఉన్న కడప స్లాబ్ బండలు విరిగి కిందపడుతున్నాయి. కాలువ లోపల, కాలువపైన ముళ్లకంపలు, పిచ్చి కంపలు ఏపుగా పెరిపోయాయి. కాలువ మరమ్మతుల గురించి పట్టించుకోక పోవడంతో హెచ్చెల్సీ నీరు చివరి ఆయకట్టు వరకూ ప్రవహించడం లేదు. పెద్దపప్పూరు మండలానికి వెళ్లే మొదటి డిస్ట్రిబ్యూటర్‌కు నీటిని సరఫరా చేసి ఏళ్లు గడుస్తున్నాయి. అక్కడి రైతులు పలుమార్లు అధికారులకు నీటి విడుదలపై ఒత్తిడి తెచ్చినా ప్రయోజనం లేకపోయింది.

చెరువులు నిండకుంటే అంతే సంగతులు..

పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి, పుట్లూరు చెరువులకు వర్షాల వల్ల నీటితో నిండితే హెచ్చెల్సీ నీటి గురించి అక్కడి రైతులు, ప్రజలు పట్టించుకోరు. ఎందుకంటే చెరువుల్లోని నీటి వల్ల భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదు. ఒక వేళ చెరువులు నిండకుంటే జల యుద్ధమే జరుగుతుంది. గతంలో పలుమార్లు తాడిపత్రి, పుట్లూరు మండల రైతులు నీటి కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆశించిన స్థాయి వర్షాలు రాకపోవడంతో చెరువులకు నీటి సమస్య ఏర్పడింది. సకాలంలో నీటి విడుదలతో పాటు ఆయకట్టు, చెరువులకు నీటిని సరఫరా చేయడం ఈ ఏడాది కష్టసాధ్యంగా మారుతోంది. నవంబరు మొదటి వారం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తామని ఇటీవల ఐబీ సమావేశంలో అధికారులు ప్రకటించారు. ఈ నీటి కోసం అటు చెరువుల పరిధిలోని రైతులు, ఇటు ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు.

తగ్గుతున్న సాగు..

హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో 30 వేల ఎకరాలు ఉన్నా నీటి విడుదలలో జాప్యం, అరకొర నీటి కేటాయింపుల కారణంగా ఏడాదికేడాది ఆయకట్టు సాగు తగ్గుతోంది. ప్రస్తుతం నీటి సరఫరా ఉన్న ఆయకట్టు కింద పలు రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రధానంగా కరివేపాకు, పొద్దుతిరుగుడు, పత్తి, కంది, మొక్కజొన్న జొన్న తదితర పంటలు సాగులో ఉన్నాయి. ఆయకట్టును నమ్ముకుని కాలువ పరివాహక ప్రాంతం పొడవుగా రైతులు పలు పంటలను సాగు చేశారు. నీటి ప్రవాహం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లల్లో నీటి శాతం పెరుగుతుందని రైతులు ఆశగా పంటలను సాగు చేస్తున్నారు.



ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలతో అధ్వానంగా టీబీసీ కాలువ



కాలువ కోతకు గురై బండలు వాలిన దృశ్యం

టీబీసీ మరమ్మతులు చేయండి



ముళ్లకంపలు, పిచ్చి మొక్కలతో పెరిగిపోయిన టీబీసీని మరమ్మతు చేయాలి. కాలువకు అతికించిన బండలు కింద పడి పగిలిపోయాయి. కాలువ కోతకు గురైంది. ఏళ్లు గడుస్తున్నా అధికారులు మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. కాలువ దెబ్బతినడంతో ఆయకట్టుకు సక్రమంగా నీరు అందడం లేదు.

– కిషోర్, రైతు, యర్రగుంటపల్లి, తాడిపత్రి మండలం

చంటిబిడ్డలు ఉక్కిరిబిక్కిరి!



బాలింతల వార్డులో నల్లగా మాడిపోయిన ఏసీలు (వృత్తంలో ఉన్నవి)



చెట్లగాలికి సేదతీరుతున్న బాలింత

- బాలింతల వార్డులో పనిచేయని ఏసీలు
- ప్రభుత్వాస్పత్రిలో సమస్యల తిష్ట

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలోని బాలింతల వార్డులో ఏసీలు పని చేయకపోవడంతో చంటి బిడ్డలు ఉక్క పోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దాదాపు మూడు నెలలుగా ఏసీలు పనిచేయకపోయినా ఆస్పత్రి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వార్డులో ఏసీలు నల్లగా కాలిపోయి కనిస్తున్నాయి. వాటి కనెక్షన్లు సైతం తీసివేసి ఏసీలను నిరుపయోగంగా మార్చారు. దీంతో మధ్యాహ్న సమయంలో వార్డులో చంటి బిడ్డలతో బాలింతలు ఉండలేక వార్డు ఆవరణలోని చెట్లనీడన సేద తీరుతున్నారు. రాత్రి వేళల్లో గాలికోసం కిటికీలు తెరిస్తే దోమలు వస్తున్నాయని, జ్వరాలతో బాధపడుతున్నామని బాలింతలు వాపోయారు. అయితే ఆ వార్డులో పని చేసే సిబ్బంది మాత్రం ఏసీలు చక్కగా పనిచేస్తున్నాయని 'సాక్షి'తో బుకాయించారు. రూం టెంపరేచర్‌కు తగ్గట్టుగా ఏసీలు వాడుతున్నామని ప్రస్తుతం చల్లగా వుండడం వల్ల వాటిని ఉపయోగించలేదన్నారు. ఈవిషయమై ఆసుపత్రి సుపరింటెండెంట్ డేనియల్‌ను వివరణ కోరగా తాను కొత్తగా బాధ్యతలు స్వీకరించానన్నారు. వార్డులో ఏసీలు ఎప్పుడు చెడిపోయాయో తనకు తెలియదన్నారు. కొత్త భవనంలోకి వార్డును తరలించాల్సి ఉందని, పాత భవనంలో మరమత్తులు చేసే అవకాశం లేదన్నారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే బాలింతల వార్డును కొత్త భవనంలోకి మారుస్తామన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ రోస్టర్‌ను అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరికి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ కారణాలతో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారన్నారు. అయితే వారి స్థానంలో కొత్తగా తీసుకునే ఫీల్డ్ అసిస్టెంట్ల ఎంపికలో తప్పనిసరిగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్ రోస్టర్‌ను అమలు చేయాలని కోరారు. ఇప్పటికీ రాజీనామా చేయని దళిత, గిరిజన ఫీల్డ్ అసిస్టెంట్లను యథావిధిగా కొనసాగించాలని వారు కోరారు.

అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు

శింగనమల: వంకలు, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం శింగనమల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను సీఐ కౌలుట్లయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి , అక్కడి నుంచి ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని సీఐకి సూచించారు. మండలంలో శాంతిభద్రతలు పర్యవేక్షించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

మాజీ ఎంపీపీ మృతి



నీలావతి (ఫైల్)

గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధికి చెందిన మాజీ ఎంపీపీ నీలావతి (63) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. రెండు రోజుల క్రితం ఆరోగ్యం బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నీలావతి మృతి చెందారు. నీలావతికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, సచివాలయ కన్వీనర్ రంగస్వామి తదితరులు నీలావతి మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

వైస్ ఎంపీపీ రంగయ్య మృతి



రంగయ్య (ఫైల్)

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ–2 రంగయ్య గురువారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ఎంపీపీ గంగాదేవి, ఎంపీటీసీ తిమోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాల వెంకటరెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కిరణ్ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంగన్‌వాడీ పోస్టులకు 32 దరఖాస్తులు

గుత్తి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు మొత్తం 32 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓ ఢిల్లీశ్వరి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. నాలుగు ఆయా, ఒక కార్యకర్త పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా ఆయా పోస్టులకు 14 దరఖాస్తులు, కార్యకర్త పోస్టుకు 18 దరఖాస్తులు వచ్చాయన్నారు.

దివ్యాంగులకు మందుల పంపిణీ

తాడిపత్రి రూరల్: మండలంలోని అవులతిప్పాయపల్లి సమీపంలోని జీవనాలయంలో ఉన్న మానసిక దివ్యాంగులకు గురువారం రూ.7 వేల విలువైన మందులు అందచేశామని ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవ సంస్థ నిర్వాహకులు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప, కన్వీనర్ శంకర్, కో–కన్వీనర్ కరుణాకర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు పాల్గొన్నారు.

దుర్గా మాతా.. నమో నమః

శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుంతకల్లు, తాడిపత్రి, శింగమల నియోజకవర్గాల్లో గురువారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపుర సుందరిగా, రాజరాజేశ్వరిగా, దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుంతకల్లు: బంగారు చీర అలంకరణలో వాసవీ మాత



తాడిపత్రిఅర్బన్: మహాలక్ష్మిగా ఆనందవల్లి అమ్మవారు



గుంతకల్లు రూరల్: జగత్ ప్రసూతిక దేవిగా కొల్హాపూర్ మహాలక్ష్మి



గుత్తి రూరల్: సేవాగఢ్‌లో దుర్గాదేవిగా మాతా జగదాంబ



యాడికి: రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో పెద్దమ్మ తల్లి



తాడిపత్రిఅర్బన్: రాజరాజేశ్వరిగా దర్శనమిస్తున్న వాసవీమాత



తాడిపత్రిఅర్బన్: బాల త్రిపుర సుందరీదేవిగా వేదగాయత్రీదేవి



గుత్తి: పూజలందుకుంటున్న వాసవీ మాత



పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో అలంకరణలో చౌడేశ్వరిదేవి



శింగనమల: బాలా త్రిపుర సుందరి అలంకరణలో దుర్గాదేవి



పామిడి: రాజరాజేశ్వరనీ దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి



గార్లదిన్నె మండలం కల్లూరులో అమ్మవారు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన కేతిరెడ్డి బ్రదర్స్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కేతిరెడ్డి సోదరులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆయన అన్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలసి గురువారం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మర్యాద పుర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది. అలాగే పలు అంశాలపై చర్చించారు.

ఇన్‌చార్జ్ ఏఈగా నవీన్

యల్లనూరు: యల్లనూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజ రెండు నెలలు సెలవుపై వెళ్లడంతో పుట్లూరు ఏఈ నవీన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటాననన్నారు.

డీటీగా ఎన్.నారాయణస్వామి



గుంతకల్లు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా గురువారం ఎస్.నారాయణస్వామి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సువర్ణ రాప్తాడు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈక్రమంలో కంబదూరు నుంచి బదిలీపై వచ్చిన నారాయణస్వామి ఇక్కడ డీటీగా బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీఓ, ఈఓఆర్డీ రిలీవ్

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ వీరరాజు (యాడికి), ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు (తాడిమర్రి), పంచాయతీ కార్యదర్శులు గీత (దిగువపల్లి), ఉమాదేవి (బ్రాహ్మణపలి), కృష్ణవేణి (సూరేపల్లి), గంగదేవి, సుజాత ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. బదిలీ అధికారులు మర్యాదపూర్వకంగా ఎంపీపీ గంగాదేవిని కలిశారు.

ఎంపీడీఓగా యోగానందరెడ్డి



గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓగా యోగానందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పుట్లూరు నుంచి బదిలీపై వచ్చానన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ ముదిగుబ్బకు బదిలీపై వెళ్లారన్నారు.

డీటీగా మల్లికార్జున

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌గా మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీటీ మాట్లాడుతూ రాప్తాడు నుంచి బదిలీపై వచ్చానన్నారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ కణేకల్లుకు బదిలీపై వెళ్లారన్నారు.

ఈఓఆర్డీగా మనోహర్‌బాబు

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా మనోహర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంబులపూలకుంటలో విధులు నిర్వహిస్తున్న ఆయనను యల్లనూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడును తాడిమర్రి మండలానికి బదిలీ చేశారు. నూతన ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు.

అంధకారంలో రైల్వేస్టేషన్

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి కరెంట్ లేక ప్రయాణికులు గంట పాటు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి విద్యుత్ శాఖ కరెంట్ నిలుపుదల చేసింది. మొదటి ప్లాట్‌ఫారంలో స్టేషన్ మాస్టర్ ఎదురుగా ఉన్న షెడ్‌లో మాత్రమే అక్కడక్కడ రెండు ట్యూబ్‌లైట్లు వేశారు. రైల్వే స్టేషన్‌కు చార్జింగ్ లైట్లను ఏర్పాటు చేయకపోవడం వల్ల కరెంట్ పోయినపుడు ప్రయాణీకులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండో ప్లాట్‌ఫారం వైపు ముళ్ల కంపలు, ఖాళీ ప్రదేశం ఎక్కువగా ఉండటంతో అంధకారంలో విష పురుగుల బారిన పడాల్సి వస్తుందన్న భయంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ కనిపించారు.

విత్తన పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పుట్లూరు/యల్లనూరు: రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పుట్లూరు ఏఓ కాత్యాయని సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి 3.400 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించిందన్నారు. జేజీ–11 రకానికి చెందిన క్వింటాల్ పప్పుశనగ ధర రూ.9,400 కాగా 25 శాతం సబ్సిడీ రూ.2,350 పోనూ రైతు రూ.7,050ల ప్రకారం 20 కిలోల బస్తాకు రూ. 1,880 చెల్లించాలన్నారు. అలాగే యల్లనూరు మండలంలోని యల్లనూరు, వెన్నపూసపల్లి, పాతపల్లి గ్రామాల రైతులు పప్పుశనగ విత్తనాల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ రామకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

యాడికి: ఎలాంటి రసాయనాలు వాడని ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏఓ మహబూబ్ బాషా సూచించారు. గురువారం మండలంలోని కోనుప్పల పాడు, ఓబుళాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పత్తితో పాటు అంతర పంటలను సాగు చేసి ఆదాయం పొందాలన్నారు. అంతకుముందు ఏఓ రైతు సేవాకేంద్రంలో రైతులతో మాట్లాడుతూ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

మెలకువలతో అధిక దిగుబడులు



'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పంటసాగులో సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ స్వాతి సూచించారు. గురువారం గుంతకల్లు మండలంలోని దోసలుడుకి, సంగాల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన వ్యవసాయ పద్ధతులు, పంటసాగులో తీసుకోవాల్సిన మెలుకువలు, ప్రకృతి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

పుట్లూరు: రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని సూరేపల్లి, అరకటివేముల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, యాజమన్య పద్ధతుల గురించి రైతులకు ఏడీఏ చెంగళరాయుడు వివరించారు. ప్రస్తుతం రబీలో సాగు చేసే పప్పుశనగతో పాటు ఇతర పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఖరీఫ్‌లో పంటలను సాగు చేసి నమోదు చేసుకున్న రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కాత్యాయని, ఏఈఓ హరి, వీహెచ్ఏ ఆదినారాయణ, ఏహెచ్ఏ శ్రీనివాసులు, ఎంపీఈఓ సుమతి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ నారాయణస్వామి

బుక్కరాయసముద్రం: ఆముదం పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి సూచించారు. గురువారం తాడిపత్రి మండంలోని దిగువపల్లిలో రేకులకుంట శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆముదం, పత్తి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఉమాదేవి, సూర్య ప్రకాష్ రైతులు పాల్గొన్నారు.

గుత్తిలో వర్షం

గుత్తి/పామిడి: గుత్తిలో గురువారం వర్షం కురిసింది. ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానంలో వర్షం నీరు భారీగా చేరింది. దీంతో క్రీడామైదానం కుంటలా మారిపోయింది. క్రీడా మైదానం పక్కనే ఉన్న ఎల్ఎం బాలుర పాఠశాలలోకి వర్షం నీరు చేరింది. అలాగే పామిడిలో గురువారం ఓ మోస్తారు వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది.

మానవత్వం చాటిన వైఎస్సార్‌సీపీ నాయకుడు



బాధితుడిని పరామర్శిస్తున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాలు..మండలంలోని వీరాపురం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు అనే వ్యక్తి గాయపడ్డాడు. పట్టణంలోని నంద్యాల రోడ్డులో సర్వీసింగ్ సెంటర్ నడుపుతున్న రాజు పని నిమిత్తం పోయి తిరిగి వస్తుండగా అదుపు తప్పి మోటర్ సైకిల్ నుంచి కింద పడ్డారు. గాయపడ్డ రాజును పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న రమేష్‌రెడ్డి తన కారులో బాధితుడిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతపురం ఆస్పత్రికి వెళ్లి బాధితున్ని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయనకు రాజుతోపాటు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.